క్లుప్తంగా

పర్యాటక ప్రాంతాల్లో పిక్నిక్ సందడి



చాపరాయి పరిసర ప్రాంతంలో వనభోజనాలు చేస్తున్న పర్యాటకులు

డుంబ్రిగుడ: మండలంలోని చాపరాయి, అరకు పైనరి, కొల్లాపుట్టు, కురిడి తదితర పరిసర ప్రాంతాల్లో పిక్నిక్ సందడి నెలకొంది. ఆయా పర్యాటక ప్రదేశాలకు బుధవారం వివిధ ప్రాంతాల నుంచి కుటుంబ సభ్యులతో వచ్చి వనభోజనాలు చేస్తూ సందడి చేశారు. చాపరాయి, అరకు పైనరీలో పర్యాటకుల తాకిడి పెరిగింది. దీంతో ఆయా ప్రాంతాల్లో చిరువ్యాపారులకు లాభాలు వస్తున్నాయని పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వాహన తనిఖీలు



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న అసిస్టెంట్ బ్రేక్ ఇన్‌స్పెక్టర్

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో బుధవారం వాహనాల విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఎనిమిది వాహనాలపై ఆర్టీ శాఖ జరిమానా విధించారు. ఈ సందర్భంగా జిల్లా వాహనాల తనిఖీ బ్రేక్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ రవి డ్రైవింగ్ లైసెన్స్‌లు, వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాహనచోదకులు రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు పక్కాగా ఉండాలని, ప్రైవేట్ వాహనదారులు నిబంధనల మేరకు ప్రయాణికులను ఎక్కించుకోవాలని లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

అగ్ని ప్రమాద బాధితులకు వితరణ



అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న సీపీఐ నేత స్వర్ణ

ఎటపాక: మండలంలోని కృష్ణవరం పంచాయతీలోని గొందిరాజుపేట గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు నిత్యావసర సరకులను సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి స్వర్ణ బుధవారం అందజేశారు. ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు అధికారులు, యంత్రాంగం అనేక హామీలు ఇచ్చినా ఆర్థిక సాయం కాని, పక్కా గృహాల నిర్మాణం కాని ఏదీ అమలు కాలేదన్నారు. ఎంపీటీసీ సభ్యుడు కంటె రాజు, రాజేశ్వరి, సత్యనారాయణ, వెంకటేష్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని వినతి



ఏపీవోకు వినతిపత్రాన్ని ఇస్తున్న గ్రామస్తులు

రంపచోడవరం: మండలంలోని దార్లవలస గ్రామానికి రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు శ్యామల బుజ్జిదొర, రంజాన్ బజార్ దొర, వంజం సుధాకర్‌దొర, రైతు కూలీ సంఘం నాయకురాలు శ్రీదేవి తదితరులు కోరారు. గ్రామానికి రహదారి సదుపాయం లేదని, సీసీ రోడ్డు నిర్మించాలని కోరుతూ ఐటీడీఏ ఏపీవో డి.ఎన్.వి.రమణకు వినతిపత్రాన్ని అందజేశారు. అనేకమార్లు అధికారులను కలిసినా రోడ్డు మంజూరు చేయలేదని, ఇప్పటికైనా స్థానికుల అవస్థలను దృష్టిలో పెట్టుకుని రోడ్డు మంజూరు చేయాలని కోరారు.

రోడ్డు విస్తరణ పనులను అడ్డుకోవద్దు

పాడేరు : పాడేరులో గిరిజనేతరులు తమ వ్యాపారాలను విస్తరించుకునేందుకు రహదారులు, డ్రైనేజీలను ఆక్రమించుకొని దుకాణాల నిర్మాణాలు చేపట్టారని దీంతో పట్టణంలో ట్రాఫిక్ రద్దీ అధికమైందని ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావు దొర అన్నారు. కలెక్టర్ చొరవతో 100 అడుగుల మేర రహదారి విస్తరణకు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. గిరిజనేతరులు రహదారి విస్తరణను అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, దీన్ని అడ్డుకోవద్దన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు

- ఘనంగా ముగిసిన వారోత్సవాలు
- పోటీల్లో విజేతలకు బహుమతులు
- తరలివచ్చిన విద్యార్థులు



పాడేరులో విజేతలకు బహుమతులను అందజేస్తున్న గ్రంథాలయ శాఖాధికారి సత్యవతి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు



హుకుంపేటలో బహుమతులిస్తున్న సర్పంచ్ వెంకటపూర్ణిమ, గ్రంథాలయాధికారి మానస



అరకులోయలోని గ్రంథాలయ పితామహుల చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు



అరకులో విజేతకు బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్ చలపతిరావు తదితరులు

అరకులోయటౌన్: గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పుస్తక పఠనం ద్వారా మరింత జ్ఞానం సంపాదించవచ్చన్నారు. గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలుగా భావించాలన్నారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయాలకు వచ్చి పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా వారం రోజుల పాటు పాఠశాల విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్, మ్యూజికల్ చైర్, వ్యాసరచన, వక్తృత్వ, పాటల పోటీలను నిర్వహించారు. ఆయా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

విద్యతోనే అభివృద్ధి

అరకులోయలోని మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు పట్టాసి చలపతిరావు, డాక్టర్ కె.భరత్‌కుమార్ నాయక్ తదితరుల గ్రంథాలయ పితామహులు అయ్యంకి వెంకటరమణ, డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్, హరి సర్వోత్తమరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థికి చదువు ఒక వనరు అని, విద్యతోనే అభివృద్ధి సాధ్యమవన్నారు. అధ్యాపకులు ధర్మారావు, శశికుమార్, బాలరాజు, బలరాం, మురళీకృష్ణ, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండల కేంద్రంలోని జరిగిన వేడుకలో ఇటీవల విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను గ్రంథాలయాధికారి మానస, సర్పంచ్ సమిడ వెంకట పూర్ణిమ తదితరులు అందజేశారు.

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని జరిగిన వేడుకలో ఇటీవల విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వి.ఎస్.నాయుడు, గ్రంథాలయాధికారి శెట్టి సునీత, హెచ్‌ఎం కృష్ణారావు తదితరులు అందజేశారు. గ్రంథాలయ ఓఎస్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పాడేరు: పట్టణంలోని పలు పాఠశాలల్లో జరిగిన వేడుకలో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గ్రంథాలయాధికారి సత్యవతి, హెచ్‌ఎంలు భీమ్‌నాయుడు, చెట్టి కన్నయ్య తదితరులు బహుమతులు అందజేశారు. లైబ్రేరియన్ కేశవ్, టీచర్ సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: మండలంలోని మర్రిపాలెం మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన వేడుకలో ప్రిన్సిపాల్ కె.సుధ, వైస్ ప్రిన్సిపాల్ వి.కె.టి.మహాలక్ష్మి, గ్రంథాలయాధికారి సీతామహాలక్ష్మి, అధ్యాపకులు డాక్టర్ కృష్ణ, పుష్ప, డాక్టర్ మంగమ్మ, డాక్టర్ శ్రీవిద్య, డాక్టర్ రాజుబాబు సౌమిత్రి, శేఖర్, అనిత, వసంత తదితరులు పాల్గొన్నారు

గంగవరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో జరిగిన వేడుకలో ఇటీవల విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను హెచ్‌ఎం రోలుపల్లి వరలక్ష్మి, గ్రంథాలయాధికారి గంగాభవాని, టీచర్లు గోపీనాథ్, గంగాభవానీ అందజేశారు.

కూనవరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో జరిగిన వేడుకలో విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను ఈవోపీఆర్‌డీ రామాంజనేయ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సురేష్, లైబ్రేరియన్ గోవిందరాజులు, డాక్టర్ వెంకయ్య అందజేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్ సాయిలక్ష్మి, సత్యారపు నాగరాజు, శ్రీనివాస్‌రావు, రమేష్, సాయిమహేష్, గౌతం, ఉపాధ్యాలు తదితరులు పాల్గొన్నారు.



డుంబ్రిగుడలో మాట్లాడుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాయుడు



గంగవరంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం వరలక్ష్మి



రాజేంద్రపాలెంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మహాలక్ష్మి, వేదికపై అధ్యాపకులు



కూనవరంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు తదితరులు

వాణిజ్య పంటలతో లాభాలు



చాపరాతిపాలెంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో మధుసూదనరావు

గూడెంకొత్తవీధి: మండలంలోని పెదవలస పంచాయతీ చాపరాతిపాలెంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మండల వ్యవసాయాధికారి మధుసూదనరావు మాట్లాడుతూ రైతులు కాఫీ, మిరియాలు, పసుపు తదితర వాణిజ్య పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. వాణిజ్య పంటలతో లాభాలు పొందవచ్చన్నారు. వివిధ పంటల సాగుపై సూచనలు, సలహాలిచ్చారు. సర్పంచ్ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి ఎంపీడీవోగా శ్రీనివాసరావు నియామకం



ఎంపీడీవో శ్రీనివాసరావుకు అభినందనలు తెలుపుతున్న ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ బాలయ్యపడాల్

చింతపల్లి: చింతపల్లి ఎంపీడీఓగా యు.ఎస్.వి.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఇప్పటివరకు ఎంపీడీవోగా విధులు నిర్వహించిన ఆషాజ్యోతి సెలవుపై వెళ్లారు. ఆమె స్థానంలో ఇప్పటివరకు మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావును పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ జిల్లా పరిషత్ సీఈవో ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవోను ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, వైస్ ఎంపీపీలు శారద, వెంగళరావుతో పాటు పలువురు ఎంపీటీసీలు, కార్యదర్శులు కలసి అభినందనలు తెలిపారు.

ప్రకృతి సాగుతో రైతులకు మేలు



బీటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో శ్రీనివాసబాబు



జద్దంగిలో సమావేశంలో పాల్గొన్న రైతులు, వ్యవసాయాధికారులు

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీ బీట, ఏనుగురాయి పంచాయితీ కొండపడ గ్రామాల్లో బుధవారం పొలం పిస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మండల వ్యవసాయశాఖాధికారి ఎం.శ్రీనివాసబాబు మాట్లాడుతూ గిరిజన రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలన్నారు. ప్రకృతి సాగుతో పంటలకు మేలు జరుగుతుందని, సేంద్రియ ఎరువుల వాడడం వల్ల మంచి దిగుబడి వస్తుందన్నారు. సర్పంచ్ రమేష్, వ్యవసాయ, పశుసంవర్థక, ప్రకృతి వ్యవసాయ శాఖల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని జద్దంగిలో ఏవో రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరులోగా మండల వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం కానున్నట్టు చెప్పారు. ఏఈఓ భవాని, వీఏఏలు ప్రవీణ్, రాజేశ్వరి, వీహెచ్‌ఏ రామరాజు పాల్గొన్నారు.

సింహగర్జన సభ పోస్టర్ ఆవిష్కరణ

ఎటపాక: హైదరాబాదులో డిసెంబర్ 1న జరగనున్న మాలల సింహ గర్జన ఆత్మ గౌరవసభ పోస్టర్ ఆవిష్కరణ బుధవారం కన్నాయిగూడెం గ్రామంలో జరిగింది. ఈ సందర్భంగా మాలమహానాడు డివిజన్ అధ్యక్షుడు డి.వంశీ మాట్లాడుతూ తమ వర్గం వారు రాజకీయ రంగంతో పాటు అన్ని రంగాల్లో సత్తా చాటాలని, మహాసభకు అందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. సత్తిబాబు, రామారావు, చంద్రబాబు, నర్సింహరావు తదితరులున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన రష్మిశ్రీకి బహుమతి ఇస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

గంగవరం: విద్యార్థులు నేటి పోటీ ప్రపంచంలో సత్తా చాటేందుకు నైపుణ్యాన్ని, విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకోవాలని ఎంపీడీవో పి.జి.రామకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జల్‌ఉత్సవ్-2024 ముగింపు కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నీటి అవశ్యకత, పర్యావరణ పరిరక్షణపై మండల స్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గంగవరం ఆశ్రమ పాఠశాలకు చెందిన దాడి రష్మిశ్రీ ప్రథమ స్థానం, మోహనాపురం ఆశ్రమ పాఠశాలకు చెందిన ఎస్.రమేష్ ద్వితీయ స్థానం, గంగవరం ఆశ్రమ పాఠశాలకు చెందిన కె.వి.ఎస్.గంగన తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు ఎంపీడీవో రామకృష్ణ, ఎంఈవో మల్లేశ్వరరావు, ఉపాధి ఏపీవో ప్రకాశ్, ఏబీఎఫ్ హేమమాధురి, ఈవోపీఆర్డీ నరసింగరావు తదితరులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉత్తమ ఫలితాలు



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ వరప్రసాద్

సీలేరు: సీలేరు పోలీసు స్టేషన్‌ను గూడెం కొత్తవీధి సీఐ వరప్రసాద్ బుధవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం స్థానిక జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి, విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. ఉన్నత చదవులు అభ్యసించి ఉత్తములుగా ఎదగాలని, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సెల్‌ఫోన్‌లలో వీడియో గేమ్‌లు, సోషల్ మీడియా వంటి దూరంగా ఉండాలని, ఇష్టంగా చదవాలని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎస్ఐ రవీంద్రనాథ్, ఉపాధ్యాయులు అప్పలరాజు, వెంకటరత్నం సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి విగ్రహ ఊరేగింపు



నెల్లిపూడిలో అమ్మవారి విగ్రహ ఊరేగింపులో భక్తులు

గంగవరం: మండలంలోని నెల్లిపూడి గ్రామంలో కనకదుర్గమ్మ ఆలయంలో గురువారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని గ్రామంలో బుధవారం భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. కేరళ కళాకారుల డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారి విగ్రహ ఊరేగింపు సాగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయంలో గురువారం జరగనున్న విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి భక్తులు తరలిరావాలని ఆలయ ధర్మకర్త సతీష్‌గౌడ్ కోరారు.

చిన్నారుల ఆరోగ్యంపై అప్రమత్తం



హెల్త్ కార్డులను పంపిణీ చేస్తున్న సీడీపీవో బాలచంద్రమణి దేవి, సర్పంచ్ పాంగి బేసు

హుకుంపేట: మండలంలోని తీగలవలస పంచాయతీ గుర్రలతోట, పాములాయి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీవో బాలచంద్రమణిదేవి బుధవారం సందర్శించారు. రికార్డులు, స్టాకు తనిఖీ చేశారు. పిల్లల బరువు తదితర వివరాలు నమోదు చేస్తున్న రికార్డుల నిర్వహణపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏజెన్సీలో పొగమంచుతో పాటు చలి తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో చిన్నపిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలన్నారు. పిల్లలకు స్వెటర్లు వేయించాలని, గోరువెచ్చని నీటిని తాగించాలని, చలిలో బయట తిరగనీయవద్దని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పిల్లలకు హెల్త్ కార్డులను సర్పంచ్ బేసు పంపిణీ చేశారు. సర్పంచ్ పాంగి బేసు, ఎంఎల్ హెచ్‌పి నాగమణి, సూపర్‌వైజర్‌లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉపాధి పనులపై అవగాహన



కుమ్మరిపుట్టులో ఉపాధి పనులపై కాలమాన పట్టికతో అవగాహన కల్పిస్తున్న ఏపీవో సంఘం

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టు గ్రామంలో ఉపాధి హామీ పథకం ఏపీవో సంఘం నాయుడు బుధవారం పర్యటించారు. గ్రామస్తులకు ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టనున్న పనులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా కాలానుగుణంగా కూలీలకు పనులు కల్పిస్తున్నట్టు చెప్పారు. ఉపాధి కూలీలు 100 రోజుల పని దినాలను సద్వినియోగం చేసుకోవాలని, జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనులు చేయాలన్నారు. గ్రామాల్లో అవసరమైన పనులను గ్రామ సభల ద్వారా గుర్తించడం జరుగుతుందని, పేదలకు ఆర్థికంగా ఆదుకునేందుకు, వలసలు నివారణకు ఉపాధి హామీ పథకం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. సర్పంచ్ రమేష్, ఉపాధి సిబ్బంది, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

మన్యంలో పెరుగుతున్న చలి



కామయ్యపేటలో చలిమంట వద్ద గిరిజనులు

హుకుంపేట: దట్టమైన పొగమంచు, చలి తీవ్రత పెరుగుతుండడంతో గిరిజనులు గజగజ వణుకుతున్నారు. ఉదయం 11 గంటల వరకు మంచుదుప్పట్లు వీడడంలేదు. సాయంత్రం 4 గంటల నుంచే చలి విపరీతంగా ఉండడంతో గిరిజనులు చలిమంటలను ఆశ్రయిస్తున్నారు.

ధ్రువపత్రాల మంజూరులో జాప్యం తగదు



మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

గూడెంకొత్తవీధి: విద్యార్థులకు అపార్ ఐడీల నమోదుకు అవసరమైన జనన, ధ్రువీకరణ పత్రాల మంజూరులో రెవెన్యూ సిబ్బంది జాప్యం చేయవద్దని త్వరితగతిన మంజూరు చేయాలని తహసీల్దారు రామకృష్ణ సూచించారు. ఆయన రెవెన్యూ అధికారులు, సిబ్బంది, వీఆర్వోలతో బుధవారం సమావేశం నిర్వహించారు. రెవెన్యూ పరంగా అందుతున్న సేవలపై సమీక్షించారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం పోడు భూములకు పట్టాల పంపిణీకి సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మీకోసంలో వచ్చిన అర్జీలను విచారించి, పరిష్కరించాలని ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దారు సీతారాం, రీసర్వే డీటీ సత్యనారాయణ తదితరులున్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్

చింతపల్లి: మండల కేంద్రంలోని బాలుర ఆశ్రమ పాఠశాల ఆవరణలో ఉద్యోగ మండల సంఘం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల పాత పెన్షన్ విధానాన్ని సాధించేందుకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డిసెంబర్ 10న విజయవాడలో చేపట్టే పాత పెన్షన్ విధాన సాధనకై చేపట్టే కార్యక్రమంలో పాల్గొవాలన్నారు. ఈశ్వరరావు, వెంకటరమణ, వెంకటరావు, ప్రసాద్, అచ్యుత్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకుడు మురళీమోహన్

గంగవరం: మండల కేంద్రంలోని ఎంపీపీ పాఠశాల ఆవరణలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ బుధవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్, నేత జి.ప్రభాకర వర్మ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ విశేష కృషి చేస్తోందన్నారు. సాల్ట్ (సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్) పేరుతో ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టు వల్ల రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా విధానాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్ర జరుగుతుందన్నారు. దీనిన అందరూ అడ్డుకోవాలన్నారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు విల్సన్ బాబు మాట్లాడుతూ కాకినాడలో జనవరి 5, 6, 7,8 తేదీల్లో యూటీఎఫ్ మహాసభలు జరగనున్నాయని, ఉపాధ్యాయులందరూ పాల్గొవాలని కోరారు. కె.కృష్ణ, తేజారావు, వెంకటేశ్వరరావు, రుక్మిణి, బొజ్జిదొర, రామకృష్ణారెడ్డి, సత్య కిరణ్‌రెడ్డి, సునీత కుమార్, వెంకన్నదొర, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

జీసీసీ గోదాములు మరమ్మతు చేయాలి



శిథిలమైన జీసీసీ గోదామును పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ సత్యనారాయణ తదితరులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ఉన్న జీసీసీ గోదామును మరమ్మతు చేయాలని వైస్ ఎంపీపీ పి.సత్యనారాయణ కోరారు. శిథిలావస్థలో ఉన్న జీసీసీ గోదాము భవనాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ జీసీసీ గోదాము భవనాల పరిస్థితి దారుణంగా ఉందని, సరకులు నిల్వ చేసేందుకు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని, గోడలు బీటాలు వారీ ప్రమాదభరితంగా ఉన్నాయన్నారు. మండలంలో 23 పంచాయతీలకు సరఫరా చేసే బియ్యం, సరకులు నిల్వకు అవస్థలు తప్పడం లేదని తక్షణమే జీసీసీ ఉన్నతాధికారులు స్పందించి, ప్రస్తుతం భవనాలను మరమ్మతులు చేసి, నూతన భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



అమీనాబాద్‌లో మాట్లాడుతున్న ఎంఈవో-2 సూరయ్యరెడ్డి

రాజవొమ్మంగి: మండలంలోని అమీనాబాద్‌లో గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను ఎంఈవో-2 సూరయ్యరెడ్డి బుధవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం పథకం అమలుతీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. సకాలంలో సిలబస్ పూర్తి చేసి, అనంతరం రివిజన్ కూడా చేపట్టాలన్నారు.